కథ

**తోపుగుంట మస్తాన్ బాబు**

# కందిరీగ నడుము

అదేం విచిత్రమో నాకర్థం కాలేదు.

ఎవరైనా కాబోయే భార్య అందంగా ఉండాలని కోరుకుంటారు. తెల్లగా ఉండాలని, సన్నగా, పొడుగ్గా, నాజుగ్గా ఉండాలని కొందరు కోరుకుంటారు. మరికొందరు బొద్దుగా, ముద్దుగా ఉండాలని కోరుకుంటారు. విశాలమైన కళ్లు, పొడవాటి జడ ఉండాలని కోరుకునే వాళ్లూ ఉంటారు. ఆస్తి ఉంటే చాలు పిల్ల ఎలా ఉన్నా ఫర్వాలేదని అనుకునే వాళ్లూ ఉంటారు.

కానీ ఇదేంటీ? కందిరీగలాంటి నడుముంటే చాలట. ఇంకేమున్నా, లేకపోయినా సర్దుకుంటాడట!

ఏం చేసుకుంటాడు కందిరీగలాంటి నడుముని? అలాంటి నడుము లేదని రంభా ఊర్వశిల్లాంటి అందగత్తెల్ని కూడా తిప్పికొట్టేశాడట.

వాడికేమన్నా పిచ్చా? ఛాదస్తమా?

అదే మాట మా అన్నయ్యతో అంటే "అదే నాకూ అర్థం కావట్లేదురా!" అన్నాడాయన. "మేం ఎంత అడిగినా చెప్పటం లేదు. నీ దగ్గర వాడికి చనువెక్కువగా, నీతోనైనా చెప్తాడేమోనన్న నమ్మకంతో వచ్చాను. నువ్వొకసారి వచ్చి వాడ్ని కదలేయ్. అది నీవల్లనే అవుతుందని నీ దగ్గరికొచ్చింది" అన్నాడు మళ్లీ.

"వదినడిగినా చెప్పట్లేదా?"

"లేదు. నేనూ, మీ వదినా, సుప్రియా అందరం అడిగాం. నీ కందిరీగ నడుము కోరికకి కారణం ఏమిట్రా అని? ఊహూ నసేమీ చెప్పట్లేదు. అదంతే... ఉండాలంటే ఉండితీరాలంతే అంటున్నాడు.." చిన్నగా నిట్టూర్పు విడిచాడు మా అన్నయ్య.

"నాదొక సందేహం" అన్నాను నేను.

"ఏమిటి? చెప్పు?"

"వాడెవరైనా కందిరీగ నడుమున్న అమ్మాయిని ప్రేమించి ఆ సంగతి మీతో చెప్పలేక ఇలా నాటకమాడుతున్నాడేమో?"

"అదీ అయ్యింది. అలాంటిదేం లేదు. ఎవర్నయినా ప్రేమించుంటే చెప్పలేనంత పిరికివాడు కాదు. వాడు అదీగాక పిల్చుకెళ్లిన పెళ్లి చూపులకల్లా వస్తూనే ఉన్నాడు. అమ్మాయి నడుము ఏమాత్రం లావుగా ఉన్నా తిరస్కరించేస్తున్నాడు"

"పోనీ వాడు కోరుకున్నట్టే కందిరీగ నడుమున్న అమ్మాయినే వెతికితే పోలా?"

"కాదని ఎవరన్నారు? వెతుకుతూనే ఉన్నాంగా? కానీ ఎక్కడ దొరుకుతారు మరీ అంతటి సన్నటి నడుమున్న అమ్మాయిలు? కవులు ఏదో ఉబుసుపోక అలా వర్ణిస్తారంతే గానీ మరీ అంత సన్నటి నడుము ఎవరికుంటుంది?"

అన్నయ్య అలా అంటుంటే నిజమే అనిపించింది నాకు. కవులు వాళ్ల ఊహకొచ్చినట్టు ఏవేవో వర్ణిస్తుంటారు. కందిరీగ నడుమంటారు. కోటేరు లాంటి ముక్కు అంటారు. శంఖం లాంటి మెడ అంటారు. నిజానికి అలాంటివన్నీ ఉంటాయా? తామరతూండ్ల లాంటి చేతులు, మీనాల్లాంటి కళ్లు. ఇవన్నీ వర్ణనలే కదా! ఈ స్త్రీకైనా ఉంటాయా? ఒకవేళ ఉన్నా అలా ఉన్న అమ్మాయి చూడ్డానికి ఏవన్నా బాగుంటుందా?

"వాడికి జ్యోతిష్యం వగైరాల మీద ఏమన్నా నమ్మకం ఉందా?" అడిగాను ఏదో ఆలోచిస్తూ.

"ఏం ఎందుకలా అడుగుతున్నావ్?"

"ఏం లేదు. ఏ కోయదొరలాంటివాడో కందిరీగ నడుమున్న అమ్మాయిని చేసుకుంటే నీకు కలిసొస్తుందని వాడ్ని ప్రలోభ పెట్టాడేమో? లేడీస్ టైలర్ సినిమాలో రాజేంద్రప్రసాద్ మచ్చ మచ్చ.. అంటుంటాడు చూడూ..."

"అదేం కాకపోవచ్చు"

"మరైతే ఈ పిచ్చి కోరిక ఏమిటి?"

"అది అర్థం కాకనే కదరా నీ దగ్గరికొస్తా?" అంటూ ఇంచుమించు నెత్తిబాదుకున్నంత పనిచేశాడు మా అన్నయ్య.

"సరే అన్నయ్య డోంట్ వర్రీ రేపే నేను నీతో బయల్దేరి వస్తాను" అంటూ ఆయనకు ధైర్యం లాంటిది చెప్పాను.

ఆ రాత్రి నేనూ నా భార్య వాసంతీ వీడిని గురించి చాలా సేపు డిస్కస్ చేసుకున్నాం. బుర్రలు బద్దలు కొట్టుకున్నాం. రక్తాలేం కారలేదు గానీ కారణమూ ఊహించలేకపోయాం.

నా భార్యకు మాత్రం ఓ విచిత్రమైన సందేహం వచ్చింది.

"ఎప్పుడైనా కందిరీగ గానీ కుడితే ఇలాంటి కోరిక పుడుతుందేమో నండీ"

"చాల్లే ఊరుకో" అంటూ గసిరేశాన్నేను.

"కుక్క కరిచిన వాడు కుక్క నడుమున్న భార్య రావాలనీ, తేలు కుట్టిన వాడు, ఏనుగుతో కొట్టించుకున్నవాడూ అలాంటి కోరికలు కోరారంటే గోవింద..." అంటూ లాజిక్ చెప్పాను.

దాంతో నా భార్య కూడా ఏకీభవించేసింది.

"మరైతే ఏమై ఉంటుంది చెప్మా?" అంది ఆసక్తిగా.

"ఉప్మా అయ్యుంటుంది! ఏమిటో రేపు నేను వెళ్లి తేల్చేస్తాగా. ఇంక కందిరీగలా రొద చెయ్యకు" అని ముసుగుపెట్టేశాను.

* * *

మర్నాడు-

నన్ను చూస్తూనే మా వదినా, సుప్రియా ఆప్యాయంగా పలకరించారు. "బాగున్నావా బాబూ? మా చెల్లి ఎలా ఉంది? బాబుకి మాటలొచ్చాయా?" అంటూ మా వదినా "పిన్నీ బాబూ కులాసానా బాబాయ్ నువ్వే మిటిలా చిక్కిపోయావ్?" అంటూ సుప్రియా ఏవేవో కుశల ప్రశ్నలు వేశారు.

వాటన్నిటికీ సమాధానాలు చెప్పటం అయ్యాక స్థిమితంగా కాఫీ త్రాగి అసలు టాపిక్‌లోకి దిగాం.

నేనూ, అన్నయ్యా వెళ్లేసరికి వాసుగాడు ఇంట్లో లేడు.

"అసలు ఇంతకీ ఏవంటాడమ్మా వాడు?" అని నేను సుప్రియనడిగాను.

"ఏముంది? మా అన్నయ్య చెప్పిందే చెప్పింది తను కూడా"

"మాట్లాడితే కందిరీగ నడుమంటున్నాడు. అంతకన్నా ఏమీ చెప్పడు. ఛస్తున్నాం"


"కందిరీగ నడుమే ఎందుకుండాలట?" అని నేను జోక్‌గా అడిగితే "తూనీగ నడుమైనా ఫర్వాలేదట" అంటూ నవ్వేసింది తను కూడా.

"సో.. మస్ట్ అండ్ షుడ్‌గా ఏదో ఒక కీటకాల నడుం మాత్రం ఉండి తీరాలన్న మాట"

"అంతేలా ఉంది చూడబోతే..."

"ఆపండ్రా. మీ వేళాకోళాలు. అసలే మేమీ విషయంలో తెగ వర్రీ అవుతుంటే మీరు జోకులేసుకుంటారేంటీ?" అన్నాడు అన్నయ్య చిరుకోపంగా.

"అసలు వ్యక్తి లేనప్పుడు జోకులు వేసుకోక చేసేదేముందన్నయ్యా? నువ్వంతలా టెన్షన్ పడక. వాడ్ని



రానీ నేనెలాగో బుజ్జగించి విషయం కనుక్కుంటాగా!" అన్నాను నేను.

ఇంతలో వాసు రానే వచ్చాడు.

వాడిని బయటికి తీసుకెళ్లి నిజంగానే ఎంతో బుజ్జగించాను.

నాతో ఓ అరగంట బ్రతిమాలించుకున్నాక నెమ్మదిగా అసలు విషయం నానుస్తూ చెప్పాడు వాసు.

వాళ్ల కాలేజీలో ఆనందరావు అనే లెక్చరర్ ఉన్నాడట. ఆయన భార్య భాగ్యలక్ష్మికి విపరీతమైన నగల పిచ్చట. దాంతో ఆ ఆనందరావుగారికి ఆనందమనేదే కరువైపోయిందంట. ఆవిడగారికి నగలు చేయించడానికి ఆయన అందిన చోటల్లా అప్పులు చేసేశాడట. మెడనిండగా దిగేసుకోవడం అయ్యాక ఆవిడ వడ్డాణం చేయించమని అడిగేసరికి ఆయనకి పై ప్రాణాలు పైనే పోయాయట. కారణం ఆవిడ విపరీతమైన లావట. అతని వల్లకాదంటే ఆమె వల్లకాటికి పోతానని బెదిరించిందట. ఆవిడకు వడ్డాణం చేయించాక ఆయన అప్పుల్లో పీకలదాకా కూరుకుపోయి తీర్చలేక ఇంచుమించు పిచ్చివాడైపోయాడట. ఎప్పుడూ శూన్యదృక్కులు చూస్తూంటాడుట. ఎవ్వరితో సరిగా మాట్లాడడట. తనలో తనే ఏదో గొణుక్కుంటూ, వేదాంతిలా మధ్య మధ్యలో నవ్వుకుంటూ ఉంటాడట. ఇదంతా చెప్పుకొచ్చి "ఒకవేళ నాక్కాబోయే భార్యక్కూడా నగల పిచ్చి ఉన్నప్పటికీ, ఆమెకు నేను వడ్డాణం చేయించాల్సి వచ్చినా కూడా మా ఆనందరావ్ సార్‌లా- పిచ్చివాడిలా అయిపోకుండా ఉండటానికే బాబాయ్ నేనిలా కోరుకుంటోంది. కందిరీగ నడుము ఉన్న పెళ్ళావం నుకో ఎక్కువ బంగారం పట్టదుగా" అంటూ ముగించాడు వాడు.

వాడి అతి తెలివికి నవ్వాలో ఏడవాలో అర్థం కాక "హోరి పిడుగా.." అన్నాను.

''అవ్ర్నం బాబాయ్- నా ఆలోచన మంచిదేగా!"

"ఒరే సన్నాసీ" అన్నాను నేను కోపంగా.

"ఏమిటి బాబాయ్?" అన్నాడు అమాయకంగా.

"నగల పిచ్చి అనేది అందరి స్త్రీలకూ ఉండదురా. ఒకవేళ కందిరీగ నడుమున్నా పెళ్లయ్యాక లావెక్కకూడదన్న నిబంధన ఏమన్నా పెడతావా? అలాంటి సన్నటి పిల్లే దొరికిందనుకుందాం. ఆమెకు గనుక నగల పిచ్చుంటే పచ్చలహారాలు, వజ్రాల గాజులూ అడిగి నిన్ను కుట్టికుట్టి చంపదూ! భర్త తాహతుకు మించిన కోరికలు కోరే ఆడది కందిరీగ నడుముదైనా, పిప్పళ్ల బస్తాయే అయినా కుట్టడంలో మాత్రం సమానమే. అర్థంలేని భయాలతో మనసు పాడుచేసుకోకు. నడుముతో నిమిత్తం లేకుండా నీకు నచ్చిన అమ్మాయిని వెంటనే పెళ్లి చేసుకో" అన్నాన్నేను.

వాడికి నా మాట మీద, నా నిర్ణయాల మీద కొద్దో గొప్పో గౌరవం ఉండటం వల్ల "అలాగే బాబాయ్" అన్నాడు బుద్ధిగా.

మేము ఇంటికి తిరిగి రాగానే "ఏమైందిరా?" అంటూ అందరూ ఆత్రంగా మమ్మల్ని చుట్టుముట్టారు.

"ఏం లేదు. వీడ్ని అర్థం లేని భయం అనే కందిరీగ కుట్టింది" అంది. నవ్వేసి ఆ మీదట నెమ్మదిగా విషయం చెప్పుకొచ్చాను.

వాళ్లు అయోమయంతో "ఆ!" అంటూ నోళ్లు వెళ్లబెట్టారు.



ఎటొచ్చీ వాసుగాడు మాత్రం సిగ్గుతో ముడుచుకుపోతూ "బాబాయ్‌కి నచ్చిన పిల్లని చేసుకుంటాను" అన్నాడు నా వెనగ్గా నక్కి.